


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM



## షాకిచ్చిన గూగుల్.. ప్లే స్టోర్ నుంచి 10 యాప్స్ తొలగింపు

గూగుల్ తాజాగా షాకింగ్ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్లే స్టోర్ నుంచి 10 భారతీయ యాప్ లను గూగుల్ తొలగించింది. అవి ALT balaji, Bharat matrimony, Naukri, 99Acres, Kuku FM, Quack -Quack, Shaadi.com, Stage, Truly Madly, Stage OTT వంటి యాప్ లను తొలగించింది.

బంగారం ధర ₹63,440 10 GRMS 24 CARAT

వెండి ధర 1KG 77,800

సెన్సెక్స్ 38 71,790

నిఫ్టి 8 21,734

చికెన్ ధర 1KG ₹ 260

గుడ్ల ధరలు డజన్ ₹68



## అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తాం
### సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో అర్హులైన పాత్రికేయులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ఇళ్ల స్థలాల అప్పగింతపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మీడియా అకడామీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డితో జేఎన్జే ప్రతినిధులు చర్చించి ఓ రోడ్ మ్యాప్తో వస్తే ఫైలుపై నిమిషంలో సంతకం చేస్తానని వ్యాఖ్యానించారు. జేఎన్జే సభ్యులైన పత్రికలు, టీవీ విలేకరులు సీఎంను కలిసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జర్నలిస్టులకు తమ ప్రభుత్వం అమిత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో మరే సంస్థకూ నామినేటెడ్ చైర్మన్ ను నియమించకపోయినా మీడియా అకాడమీకి చైర్మన్ ఎంపిక చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇక ఇండ్ల స్థలాల అప్పగింతను 100 రోజుల్లో మొదలు పెడతామన్న హామీని అమలు చేస్తున్నందుకు మీడియా ప్రతినిధులు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. సొసైటీకి 16 ఏళ్ల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం నిజాంపేట, పేట్బషీరాబాద్ ప్రాంతాల్లో 70 ఎకరాల స్థలాన్ని జేఎన్జేకు కేటాయించిందని తెలిపారు. సొసైటీ స్థలాన్ని అప్పగించాలని సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చినా అవి అమలు కాలేదన్నారు. నాటి నుంచి స్థలాన్ని కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. అయితే, రాష్ట్రంలో ఇతర అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో మీడియా అకాడమీతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తే వారికి కూడా స్థలాలను ఇస్తామనీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు.



## రామేశ్వరం కేఫ్‌లో పేలుడు..
# అది ప్రెజర్ కుక్కర్ బాంబ్
### కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

కర్ణాటక రాజధాని బెంగళూరులోని ప్రముఖ రామేశ్వరం కేఫ్‌లో పేలుడు సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనలో నిందితుడు ప్రెజర్ కుక్కర్ బాంబు వాడాడని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించారు. దీనిపై భాజపా రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. "ఈ విషయంలో భాజపా రాజకీయాలు చేస్తోంది. వారి హయాంలో కూడా బాంబు పేలుళ్లు జరిగాయి. అప్పుడు వారు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడ్డారా..? నేను ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. దీనిపై రాజకీయాలు చేయకూడదు" అని అన్నారు. అలాగే ఘటనాస్థలానికి వెళ్లనున్నట్లు చెప్పారు. అలాగే ఈ కేసు గురించి మాట్లాడారు. "మాస్క్, క్యాప్ ధరించిన ఓ వ్యక్తి బస్సులో ప్రయాణించి కేఫ్‌కు వచ్చాడు. రవ్వఇడ్లీని ఆర్డర్ చేసుకొని ఒక దగ్గర కూర్చున్నాడు. తర్వాత బాంబుకు టైమర్ సెట్ చేసి, వెళ్లిపోయాడు. అతడు ఎవరో తెలీదు. ఫొటోలు వచ్చాయి. సాధ్యమైనంత త్వరగా నిందితుడిని అదుపులోకి తీసుకుంటాం. పేలుడులో గాయపడిన వ్యక్తులు ప్రస్తుతం కోలుకుంటున్నారు" అని తెలిపారు. ఈరోజు పోలీసు అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ ఘటనపై కర్ణాటక పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ పేలుడులో మొత్తం 10 మంది గాయపడినట్లు చెప్పారు. ఆ నిందితుడి కదలికలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఇదిలా ఉంటే.. 2022 నవంబర్‌లో మంగళూరులో ఇదే తరహాలో కుక్కర్ బాంబు పేలింది. ఈ రెండు ఘటనల మధ్య ఏదైనా సంబంధం ఉందా..? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



## గంభీర్ సంచలన ప్రకటన..
# బీజేపీకి గుడ్‌బై!

టీమిండియా మాజీ ఓపెనర్, బీజేపీ ఎంపీ గౌతం గంభీర్ కీలక ప్రకటన చేశాడు. తాను రాజకీయ విధుల నుంచి తప్పుకోవాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ఈ మేరకు బీజేపీ చీఫ్ జేపీ నడ్డాకు ఎక్స్ వేదికగా గంభీర్ విజ్ఞప్తి చేశాడు. అదే విధంగా ఇన్నాళ్లు ప్రజలకు సేవ చేసేందుకు తనకు అవకాశం ఇచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపాడు. క్రికెట్‌పై పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గంభీర్ వెల్లడించాడు.

### ప్రధాని మోదీకి ధన్యవాదాలు

"దయచేసి రాజకీయ విధుల నుంచి నాకు విముక్తి కల్పించగలరని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా గారికి నాదొక విన్నవించాను. తద్వారా నా ప్రణాళికలకు అనుగుణంగా నేను పూర్తి స్థాయిలో క్రికెట్‌పై దృష్టి సారించే వీలు కలుగుతుంది. ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా. జై హింద్" అని గౌతం గంభీర్ ట్వీట్(ఎక్స్) చేశాడు. కాగా గంభీర్ తూర్పు ఢిల్లీ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అతడు తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతోంది.




## ఏపీలో బీజేపీ ఒంటరి పోరు!
### పోటీకి భారీగా దరఖాస్తులు

ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు బీజేపీ రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బీజేపీలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో పోటీకి రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. దీంతో, టీడీపీ-జనసేనతో బీజేపీ పొత్తు ఆసక్తికరంగా మారింది. అయితే, ఏపీలో పొత్తులు లేకపోయినా పోటీకి సై అంటూ బీజేపీ అభ్యర్థులు వేలాదిగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ స్థానాలకు గానూ ఇప్పటి వరకు 3283 దరఖాస్తులు వచ్చాయి. ఒక్క గుంటూరు జిల్లా నుంచే దాదాపు 125కుపైగా దరఖాస్తులు రావడం విశేషం. ఇక, 25 లోక్‌సభ స్థానాలకుగానూ 1861 దరఖాస్తులు అందాయి.

### పార్లమెంట్ స్థానాలపై ఫోకస్..

మరోవైపు.. నేడు శివప్రకాష్ జీ ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరుగనుంది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ముగ్గురు, ప్రతీ లోక్‌సభ స్థానానికి మూడు పేర్ల చొప్పున అభ్యర్థుల జాబితాను ఎంపిక చేసి శివప్రకాష్ పార్టీ జాతీయ నాయకత్వానికి పంపనున్నారు. ప్రతీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర స్థాయి బాధ్యతల్లో ఉన్న నేతలు నేడు జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. ప్రతీ పార్లమెంట్ స్థానంపై చర్చించడానికి ఒక గంట సమయం కేటాయించినట్టు సమాచారం.



## ఓటిటి రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్న
# సేవ్ ది టైగర్స్ 2

యంగ్ అండ్ టాలెంటెడ్ నటులు ప్రియదర్శి, చైతన్య కృష్ణ అలాగే అభినవ్ గోమఠం మెయిన్ లీడ్ లలో దర్శకుడు అరుణ్ కొత్తపల్లి తెరకెక్కించిన ఓటిటి హిట్ సిరీస్ "సేవ్ ది టైగర్స్" మరి డిస్నీ + హాట్ స్టార్ లో హాట్ స్టార్ స్పెషల్స్ లో భాగంగా స్ట్రీమింగ్ కి వచ్చిన ఈ సిరీస్ సూపర్ హిట్ అయ్యింది. ఫ్యామిలీ ఆడియెన్స్ ని ఎంతగానో ఇది ఆకట్టుకోగా దీని సీక్వెల్ కోసం కూడా చాలా మంది వెయిట్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఫైనల్ గా ఈ సీక్వెల్ పై క్లారిటీ వచ్చేసింది. మేకర్స్ ఇంట్రెస్టింగ్ ట్రైలర్ తో మరిన్ని హిలేరియస్ సీన్స్ తో ఈసారి మరింత కామెడీ ని అయితే ప్రామిస్ చేస్తున్నారు. ఇక మెయిన్ లీడ్ ట్రాక్ లు అయితే మరింత హైలైట్ అయ్యేలా కనిపిస్తున్నాయి. మరి ఈ అవైటెడ్ సిరీస్ ని ఈ మార్చ్ 15 నుంచి అయితే హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ చేయడానికి తీసుకొస్తున్నట్టుగా డేట్ ని అయితే ఇప్పుడు లాక్ చేసేసారు. ఇక ఈ అవైటెడ్ సిరీస్ కి అజయ్ అరసాడా సంగీతం అందించగా మహి వి రాఘవ్, ప్రదీప్ అద్వైతం లు నిర్మాణం వహించారు. అలాగే ప్రస్తుతం సీజన్ 1 హాట్ స్టార్ లో ఈ మార్చ్ 10 వరకు ఫ్రీ గా స్ట్రీమింగ్ కి అందుబాటులో ఉంది.

## డ్రగ్స్ కేసులో అనూహ్య మలుపు..
# క్రిష్ నమూనాల సేకరణ..!

డ్రగ్స్ కేసులో అనుమానితుడిగా ఉన్న సినీ డైరెక్టర్ క్రిష్ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ బెయిల్ పై హైకోర్టులో విచారణ జరగ్గా.. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా పడింది. దీంతో అనూహ్యంగా క్రిష్ శుక్రవారం సైబరాబాద్ పోలీసుల విచారణకు హాజరయ్యారు. వాస్తవానికి విచారణకు వస్తానని చెప్పి ఆయన ముందస్తు బెయిల్‌కు వెళ్లడంతో ఆయనపై అనుమానాలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో బెయిల్ పిటిషన్ వాయిదా పడటం.. ఆయన విచారణకు రావడం వంటి పరిణామాలు జరిగాయి. అత్యంత గోప్యంగా పోలీసుల ముందు కొచ్చిన క్రిష్‌ను పోలీసులు కొద్దిసేపు విచారించిన అనంతరం రక్త, మూత్ర నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. డ్రగ్స్ అంశాలపై క్రిష్ రియాక్ట్ అయ్యారు.. తాను ముంబయిలో ఉన్నానని, పోలీసులు ఎప్పుడు పిలిచినా విచారణకు వస్తానని తెలిపారు. ప్రధాన నిందితుడిగా ఉన్న గజ్జల వివేకానంద్, నిర్భయ్, కేదార్‌నాథ్ రక్త నమూనాలు పాజిటివ్‌గా రావడంతో ఈ కేసు కీలక పరిణామంగా మారింది. హోటల్‌పై పోలీసులు దాడి చేసిన సమయంలో డ్రగ్స్ దొరక్కపోవడంతో ప్రధాన నిందితుడి జ్యుడిషియల్ రిమాండుకు అనుమతి లభించలేదు. మరోవైపు ఈ కేసులో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న లిషి, సందీప్, శ్వేత, నీల్ ఇప్పటి వరకు పోలీసుల విచారణకు రాలేదు. వారు డ్రగ్స్ తీసుకోకుంటే భయం ఎందుకు అనే ప్రశ్నలు వస్తున్నాయి.





## కాంగ్రెస్ నేతలకు
# నితిన్ గడ్కరీ లీగల్ నోటీసు


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కాంగ్రెస్‌నేతలకు చట్టపరమైన నోటీసులు పంపారు. ఓ ఇంటర్వ్యూలో తాను మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియో క్లిప్‌ను కాంగ్రెస్ నేతలు వక్రీకరించారని ఎఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, జైరాం రమేష్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారు. 'కేంద్ర మంత్రి గడ్కరీ కాంగ్రెస్ పోస్ట్ చేసిన 19 సెకండ్ల వీడియో క్లిప్‌ను చూసి షాక్ అయ్యారు. ఆయన మాట్లాడిన మాటలు, వాటి అసలు అర్థాన్ని కాంగ్రెస్ నేతలు వక్రీకరించారు' అని న్యాయవాది బాలేందు శేఖర్ తెలిపారు. గందరగోళాన్ని, అపకీర్తిని సృష్టించడానికి నితిన్ గడ్కరీ మాటాలను వక్రీకరించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు పోస్ట్ చేసిన ఆ వీడియో క్లిప్‌ను తొలగించాలని లిగల్ నోటీసులు పంపినట్లు తెలిపారు. మూడు రోజుల్లో తన క్లైంట్‌కు రాతపూర్వకంగా క్షమాపణలు చెప్పాలని లాయర్ బాలేందు శేఖర్ తెలిపారు.

## ప్రశ్నించిన వారిని వేధించడమే
# జగన్ పని: చంద్రబాబు

ప్రజాసేవకు మారుపేరు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. యుద్ధానికి సై అంటూ అంతా ముందుకొస్తున్నారని తెలిపారు. 'ప్రశ్నించిన వారిని వేధించడమే జగన్ పని. అహంకారంతో ఆయన రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేసిన వ్యక్తిని ఇంటికి పంపాలి. జగన్ విధానాలు నచ్చక నేతలు తిరుగుబాటు చేసే పరిస్థితికి వచ్చారు. ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల కోసం అందరూ ఆలోచించాలి.' అని చంద్రబాబు అన్నారు.

### ఈ నెల 6 నుంచి చంద్రబాబు ప్రజాగళం సభలు

టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 6 నుంచి ప్రజాగళం పేరుతో ప్రచార సభలు నిర్వహించనున్నారు. ఈ నెల 6 నుంచి 10 వరకు ప్రజాగళం షెడ్యూల్ ఖరారైంది. రోజుకు రెండు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. 6న నంద్యాల, మైదుకూరు. 7న పామర్రు, వేమూరు. 8న పాడేరు, పలాస. 9న రామచంద్రాపురం, ప్రత్తిపాడు. 10న మార్కాపురం, ఉదయగిరి నియోజకవర్గాల్లో సభలను నిర్వహించనున్నారు.






## ఇంకా ప్రజల వద్ద 8,470 కోట్ల విలువైన 2 వేల నోట్లు: ఆర్బీఐ

చలామణీలో ఉన్న రెండు వేల రూపాయల నోట్లలో 97.62 శాతం తిరిగి బ్యాంకుల్లో జమయ్యాయని రిజర్వుబ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఈ నోటును ఉపసంహరించుకొని తొమ్మిది నెలలు అయినప్పటికీ ఇంకా ప్రజల వద్ద రూ.8,470 కోట్ల విలువైన 2 వేల నోట్లు ఉన్నాయని పేర్కొంది. గతేడాది మే 19న ఈ నోట్‌ను రిజర్వుబ్యాంక్ ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఉపసంహరించుకున్నప్పుడు మార్కెట్లో రూ.3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు ఉండగా..ప్రస్తుతం ఇవి రూ. 8,470 కోట్లకు తగ్గాయని సెంట్రల్ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. వీటిలో 97.62 శాతం నోట్లు తిరిగి బ్యాంకుల్లో జమయ్యాయని, ఫిబ్రవరి 29, 2024 నాటికి ఇంకా రూ.8,470 కోట్ల విలువైన నోట్లు జమకాలేదని ఆర్బీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది.

# ఉద్యోగులకు బంపరాఫర్.. హెచ్-1బీ వీసాపై బైడెన్ ప్రభుత్వం కీలక ప్రకటన!




హెచ్-1బీ వీసా కోసం అప్లయ్ చేశారా? ప్రాజెక్ట్ నిమిత్తం అమెరికాకు వెళ్లే యోచనలో ఉన్నారా? అయితే మీకో గుడ్ న్యూస్. హెచ్1-బీ వీసా రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌ను సులభతరం చేసేందుకు అగ్రరాజ్యం అమెరికా ఫిబ్రవరి 28,2024న యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ విభాగం (యూఎస్‌సీఐఎస్) మైయూఎస్‌సీఐఎస్ పేరుతో కొత్త సేవల్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ పద్దతిలో హెచ్-1బీ వీసా ప్రాసెస్ మరింత సులభ తరం అయ్యేలా ఆర్గనైజేషనల్ అకౌంట్‌ను వినియోగించుకునే సదుపాయాన్ని కల్పించింది.

**హెచ్-1బీ వీసా ప్రాసెస్ వేగవంతం**

ప్రపంచ వ్యాపంగా ఆయా కంపెనీలు తమ ప్రాజెక్ట్‌ల నిమిత్తం ఉద్యోగుల్ని అమెరికాకు పంపిస్తుంటాయి. ఇందుకోసం ఉద్యోగులు హెచ్-1బీ వీసా తప్పని సరిగా ఉండాలి. ఇప్పడు ఆ హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్ ప్రాసెస్ వేగవంతం జరిగేలా చర్యలు తీసుకుంది జోబైడెన్ ప్రభుత్వం. ఇందులో భాగంగా మైయూఎస్‌సీఐఎస్‌లోని ఆర్గనైజేషనల్ అకౌంట్‌లో సంస్థలు పనిచేస్తున్న ఉద్యోగులు, లీగల్ అడ్వైజర్లు హెచ్1-బీ వీసా రిజిస్ట్రేషన్, హెచ్-1బీ పిటిషన్ ప్రాసెస్ చేయొచ్చు.

**కొత్త పద్దతి హెచ్-1బీ వీసా పిటిషనర్లకు వరం**

జోబైడెన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మైయూఎస్‌సీఐఎస్ ఈ కొత్త వీసా పద్దతి హెచ్-1బీ వీసా పిటిషనర్లకు వరంగా మారుతుందని వీసా నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త వీసా ప్రాసెస్‌లో సంస్థలే హెచ్-1బీ ప్రాసెస్ చేసుకోవచ్చు.హెచ్-1బీ రిజిస్ట్రేషన్, పిటిషన్స్‌తో పాటు ఫారమ్ ఐ-907కి సంబంధించిన కార్యకలాపాల్ని చక్కబెట్టుకోవచ్చు.

**ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాలు**

అంతేకాదు మైయూఎస్‌సీఐఎస్ ఉన్న డేటా ఆధారంగా అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) అధికారులు వలసదారుల అర్హతని బట్టి ఇచ్చే ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాలు కల్పించాలా? వద్దా? అనే అంశాన్ని పరిగణలోకి తీసుకుంటారని యూఎస్‌సీఐఎస్ ఓ ప్రకటనలో తెలిపింది.

**ఈ దశ చాలా అవసరం**

మార్చి 2024 నుండి సంస్థలు హెచ్-1బీ ఎలక్ట్రానిక్ రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో పాల్గొనడానికి కొత్త ఆర్గనైజేషనల్ అకౌంట్‌ను క్రియేట్ చేయాలి. 2025 ఆర్థిక సంవత్సరానికి హెచ్-1బీ పిటిషన్‌లను ఫైల్ చేయాలనుకుంటున్న వారికి ఈ దశ చాలా అవసరం.

**ఫారమ్ ఐ-907 అంటే?**

ఇందులో కొత్త మొత్తాన్ని చెల్లించి వీసా ప్రీమియం ప్రాసెసింగ్ సర్వీసులు పొందవచ్చు. ఉదాహరణకు పిటిషన్స్, అప్లికేషన్‌లు.

**హెచ్-1బీ రిజిస్ట్రేషన్, హెచ్-1బీ పిటిషన్స్ అంటే?**


ఉదాహరణకు భారతీయులు అమెరికాలో ఏదైనా సంస్థలో పనిచేయాలనే వారికి హెచ్-1బీ వర్క్ పర్మిట్ తప్పని సరి. ఈ హెచ్-1బీ వీసా అప్లయ్ చేయడాన్ని హెచ్-1బీ రిజిస్ట్రేషన్ అంటారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఎంపికైనా అభ్యర్థులకు తర్వాత జరిగే ప్రాసెస్‌ను హెచ్-1బీ పిటిషన్ అని అంటారు.




## జపాన్‌లో గ్రాండ్ వెల్‌కమ్ అందుకున్న రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక మందన్న తిరుగులేని విజయాలతో దూసుకు పోతున్నది. 'పుష్ప' చిత్రంలోని శ్రీవల్లి పాత్రతో దేశవ్యాప్తంగా యువతరానికి చేరువకావడమే కాకుండా నేషనల్ క్రష్‌గా పేరు తెచ్చుకుంది. ఇక గతేడాది విడుదలైన 'యానిమల్' సినిమాలో గీతాంజలి పాత్రలో అద్భుత అభినయంతో మరింత పేరు సంపాదించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ అమ్మడు అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. జపాన్‌లోని టోక్యో వేదికగా జరిగే ప్రతిష్టాత్మకమైన క్రంచీరోల్ అనిమే అవార్డ్స్ 2024లో భారత్ తరపున పాల్గొనేందుకు రష్మికకు అవకకాశం దక్కింది. ఇక ఈ ఈవెంట్ కోసం జపాన్ వెళ్లింది రష్మిక. అయితే టోక్యో ఎయిర్ పోర్టులో రష్మిక ల్యాండ్ అవ్వగానే నేషనల్ క్రష్‌కు గ్రాండ్‌గా స్వాగతం లభించింది. జపాన్ లో రష్మిక అభిమానులు...
.ఆమె ఫొటోస్‌తో డిజైన్ చేసిన ప్లకార్డులు చూపిస్తూ సాదరంగా ఆహ్వానించారు. ఇక జపాన్ అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమకు పొంగిపోతూ.. రష్మిక తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఈ అవార్డుల వేడుక మార్చి 02న టోక్యోలో జరుగనుంది.





## గాజాలో ఆకలి కేకలు.. బైడెన్ కీలక నిర్ణయం



ఇజ్రాయెల్ దాడులతో గాజాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మానవతా సాయం కోసం ఎదురు చూస్తున్న అమాయకులపై ఐడీఎఫ్ కాల్పులు జరపడం యావత్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆకలితో అల్లాడుతున్న గాజావాసులను ఆదుకునేందుకు అమెరికా ముందుకొచ్చింది. విమానాల ద్వారా ఆహార ప్యాకెట్లను గాజాలోకి జారవిడుస్తామని అధ్యక్షుడు బైడెన్ మీడియాకు వెల్లడించారు. "ఈ క్లిష్ట పరిస్థితుల్లో గాజాకు మానవతా సాయం ఎంతో అవసరం. అందించేందుకు అమెరికా సిద్ధంగా ఉంది" అని బైడెన్ పేర్కొన్నారు. సముద్ర మార్గాన పెద్ద మొత్తంలో సహాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. 'రెడీ టూ మీల్స్' ప్యాకెట్లను మిలటరీ విమానాల ద్వారా ఎయిర్‌డ్రాప్ చేయనుంది. ఈ ఆహార పంపిణీ నిరంతర ప్రక్రియ అని వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు తెలిపారు. జోర్డాన్, ఫ్రాన్స్ సహా ఇతర దేశాలు ఇప్పటికే గాజాలోకి ఆహార పొట్లాలను జారవిడిచాయి. మానవతా సాయం ఫలాలు అందరికీ అందాలంటే గాజా-ఈజిప్ట్ సరిహద్దులోని రఫా చెక్‌పోస్టు తెరుచుకుంటేనే అది జరుగుతుందని.. లేదంటే ఈ చర్య అంతగా ప్రభావం చూపకపోవచ్చని మరొక అమెరికా అధికారి అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా.. గురువారం తెల్లవారుజామున మానవతా సాయం కోరుతూ ట్రక్కుల వద్ద గుమిగూడి ఉన్న వారిపై ఇజ్రాయెల్ విచక్షణా రహితంగా కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. ఎంతో మంది తీవ్రంగా గాయపడ్డారు. చిన్నారులు తీవ్ర పోషకాహారం లోపంతో బాధపడుతున్నారని ఐరాస ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆహార కొరత ఏర్పడి రోజుల తరబడి పస్తులు ఉంటున్నారు. ఆకలికి తాళలేక పశువుల దాణానే ఆహారంగా తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరం. ఈ సంక్షోభాన్ని నివారించాలంటే రోజుకు 500 ఫుడ్ ట్రక్కులు గాజాలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. కానీ, జనవరిలో రోజుకు 150.. ఫిబ్రవరిలో 97 ట్రక్కులు మాత్రమే గాజాలోకి ప్రవేశించాయి.



## టీడీపీలో చేరిన వసంత కృష్ణప్రసాద్

వైఎస్సార్సీపీకి గుడ్‌బై చెప్పేసిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ టీడీపీలో చేరారు. శనివారం ఉదయం టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్న వసంత కృష్ణ ప్రసాద్... అధినేత సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కృష్ణప్రసాద్‌తో పాటు మైలవరానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీలో తనకు ఎలాంటి గౌరవం దక్కలేదన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నదే తన కోరికన్నారు.

**మైలవరం టికెట్‌పై..**

కాగా.. మైలవరం టీడీపీ టికెట్‌పై వసంత కృష్ణ ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని సర్వేల్లోనూ మైలవరంలో తానే గెలుస్తానని తేలిందన్నారు. జగన్ పిలిచి టికెట్ నీకేనని చెప్పినా వద్దని వచ్చేసినట్లు తెలిపారు. చంద్రబాబు పోటీ చేయమంటే చేస్తానని లేకపోతే పార్టీ కోసం పనిచేస్తానని కృష్ణప్రసాద్ తేల్చిచెప్పారు.



## టీఎంసీలో వర్గపోరు.. కునాల్ ఘోష్ రాజీనామా?

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)లో కీలక నేత కునాల్ ఘోష్ రాజీనామా చేశారు. కునాల్‌కు అదే పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత సుదీప్ బందోపాధ్యాయ మధ్య గత కొన్ని నెలలుగా వివాదం నడుస్తోంది. దాని పరిణామం ఇప్పుడు బయటపడింది. మార్చి 10న కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో మమతా బెనర్జీ మెగా ర్యాలీ నిర్వహించనున్నారు. దీనికి సన్నాహాలు చేసేందుకు సుదీప్ ఇటీవల కోల్‌కతాలో టీఎంసీ నేతలతో సమావేశమయ్యారు. అయితే దీనికి ఆయన కునాల్ ఘోష్‌ను ఆహ్వానించలేదు. దీంతో కునాల్ ఘోష్.. సుదీప్ పేరు ప్రస్తావించకుండా ట్విట్టర్‌లో ఆయనపై విమర్శల దాడి చేసారు. 'ఆ నేత అసమర్థుడు. గ్రూపులను నడిపే నేత, స్వార్థపరుడు. ఏడాది పొడుగునా చిల్లర రాజకీయాలు చేసి, ఎన్నికలకు ముందు 'దీదీ అభిషేకం' పేరుతో, పార్టీ కార్యకర్తల సహకారంతో ఎన్నికల్లో గెలవాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఇది వ్యక్తిగత ప్రయోజనాలకే ఉపయోగపడుతుంది. మరేలాంటి ప్రయోజనం ఉండదు' అని పేర్కొన్నారు. 2017లో రోజ్ వ్యాలీ యజమాని నుంచి రూ.27 లక్షలు తీసుకున్న ఆరోపణలపై సీబీఐ సుదీప్‌ను అరెస్ట్ చేసి భువనేశ్వర్ జైలుకు పంపింది. నెలరోజుల పాటు జైలులో ఉన్నాక అతనికి బెయిల్ వచ్చింది. 2018లో జరిగిన ఈ కుంభకోణంలో ఈడీ రూ.130 కోట్లను స్వాధీనం చేసుకుని, సుదీప్‌ను విచారించింది. కాగా కునాల్ ఘోష్ తన రాజీనామాకు ముందే తన ట్విట్టర్ ప్రొఫైల్ నుండి టీఎంసీ అధికార ప్రతినిధి, జనరల్ సెక్రటరీ తదితర పోస్ట్‌లను తొలగించి, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త అని రాశారు.

## 33% రాజ్యసభ సభ్యులపై క్రిమినల్ కేసులు

రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 245. వీరిలో 225 మంది సిట్టింగ్ ఎంపీలపై నమోదైన క్రిమినల్ కేసులు, వారి ఆస్తులను ఎన్నికల హక్కుల సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫారమ్స్(ఏడీఆర్) విశ్లేషించింది. ఒక నివేదిక విడుదల చేసింది. 225 మంది రాజ్యసభ సభ్యుల్లో 33 శాతం మంది(75 మంది)పై క్రిమినల్ కేసులు ఉన్నట్లు గుర్తించింది. ఈ విషయాన్ని వారే స్వయంగా అఫిడవిట్లలో ప్రస్తావించారని వెల్లడించింది. 225 మంది సభ్యుల మొత్తం ఆస్తుల విలువ రూ.19,602 కోట్లు అని తేలిచంది. అలాగే వీరిలో 14 శాతం మంది.. అంటే 31 మంది బిలియనీర్లు ఉన్నారని తెలియజేసింది. 18 శాతం మంది(40 మంది) ఎంపీలపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన నేరాల్లో కేసులు నమోదయ్యాయని పేర్కొంది.





## మంత్రి బొత్సపై పోటీ.. వెనకడుగు వేస్తున్న టీడీపీ నేతలు

వైసీపీ మంత్రి బొత్స నారాయణపై పోటీకి టీడీపీ నేతలు వెనకాడుతున్నారు. ప్రస్తుతం బొత్స ప్రాతినిధ్యం వహిస్తున్న విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి నియోజకవర్గం నుంచి టికెట్ అనగానే తమ్ముళ్లు జారుకుంటున్నారు. మా దారి మేము చూసుకుంటామని ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు నేతలు తేల్చి చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ రావు రిజెక్ట్ చేశారు.

## 26/11 ముంబై బాంబు పేలుళ్ల ప్రధాన సూత్రధారి మృతి



ముంబై బాంబు పేలుళ్ల ప్రధాన సూత్రధారి, లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ అజామ్ ఛీమా మృతి చెందినట్లు సమాచారం. పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్‌లో గుండెపోటుతో ఆయన మరణించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆయన అంత్యక్రియలు ఫైసలాబాద్‌లోని మల్కన్‌వాలాలో పూర్తైనట్లు సమాచారం.15 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు. కొబాలా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ సహా అనేక ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులు జరిపారు.